# మెదడుకి తెర తీస్తే

టి. షణ్ముఖరావు B.S. Bed



అది పెద్ద టౌనూ కాదు, చిన్న పల్లే కాదు.

అక్కడ అదొక ఆఫీసు. చిన్నదీ కాదు. పెద్దదీ కాదు. అందులో రాఘవరావు ఒక ఉద్యోగి నైట్ వాచర్‌లాంటి చిన్న ఉద్యోగి కాదు. ఆఫీసరూ కాడు. పోనీ వెనక ఆస్తుల్ని పరిగణించినా కూటికి లేనివాడూ కాడు. కోటీశ్వరుడూ కాడు. కుటుంబనియంత్రణ పాటించిన వాడు కాడు. కుర్రాడు కాడు. ముసలాడు కాడు. సిగరెట్టు తప్ప దురభ్యాసాలున్నవాడు కాడు. కళాకారుడు కాడు. ఎద్దులాటివాడు కాడు. అసలు రాఘవరావు ఏదీ కాడు.

నిద్రపోతున్న రాఘవరావుకి ఏదో పీడ కల వచ్చి హఠాత్తుగా తెలివి వచ్చి వాచీ చూసుకున్నాడు. నాలుగయింది (— ఇలాంటి కలే వచ్చింది? ఈవేళ ఇంకేం కొంప మునుగుతుందో? హయ్యో, తెల్లారి పోతూందే? — పరుప్మీంచిలేస్తే—బియ్యం కొనాలి— కట్టెలు కొనాలి — ఆఫీసు కెళ్ళాలి— పైవాడి తిట్లు తినాలి — నా కిష్టం లేని — ఇంట్రస్టు లేని ఫైళ్ళు తిరగెయ్యాలి—రాయాలి— —పనికి మాలిన కబుర్లు చెప్పే ఆఫీసుమేట్లతో వేగాలి— చీకటి పడ్డాక ఎంత వేళకో ఇంటికి రావాలి — వచ్చి రేపటి గురించి ఇండెంట్లు వినాలి — పిల్లల ఏడుపులూ తల్లి విసుగు కేకలూ భరించాలి — ఇంకా — ఇంకా — )

రాఘవరావుకి నిద్రంటే ఇష్టం — విశ్రాంతి అంటే ఇష్టం — ఒంటరిగా కూర్చొని తియ్యటి కలలు కనడమంటే ఇష్టం — ఏదో చిరుతిళ్ళు తింటూ పేపరు చదవడమంటే ఇష్టం. తెల్లటి బట్టలు వేసుకోవడమంటే ఇష్టం. ఏడుపుగొట్టు సినిమాలు చూడమంటే ఇష్టం. దేశభక్తి పాటలంటే ఇష్టం. భరతనాట్యమంటే ఇష్టం. ఇవన్నీ భూమ్మీద తీరని కోరికలేం కావు. కాని అతడికి తీరవు. అందుకే తెల్లారుతూందంటే భయం.

(వద్దు దేవుడా! వద్దు — తెల్లారొద్దు — ఇలాగే ఉండనీ... ఈ రాత్రి ఇంకా సాగనీ —నిద్ర పోనీ — ) రాఘవరావు అభ్యర్థన విని సూర్యుడు ఉదయించడం మానలేదు. వాచీ చూస్తే ఆరయింది. పరుపుమీంచి లేవక తప్పలేదు.

స్నానం చేసి పటం ముందు నిల్చున్నాడు. ఆ పటంలో దేవుడనబడేవాడు కామోద్రేకంతో ఎవరైనో కొంగు పట్టుకు లాగుతున్నాడు. "ఓ పరమాత్మా! నాకు ఆనందాన్నియ్యి — సుఖాన్నియ్యి. ప్రశాంతత నియ్యి. లేదా డబ్బియ్యి.. అన్నీ నేనే కొనుక్కుంటాను." అని మొక్కాడు (—సంవత్సరాల తరబడీ ఇలాగే మొక్కుతున్నాను— ఏ మిచ్చావు కనక? — అవును, ఇంకేమిస్తావు? — నా కష్టలకి నేనే బాధపడ్డాను — నా ఇంటి రోగాలకి నేనే డాక్టర్లకీ మందులకీ డబ్బిచ్చేను — నా అప్పులకి నేనే వడ్డీలు కట్టేను — నా తప్పులకి నేనే చీవాట్లు తిన్నాను — నా పిల్లలకి నేనే సీట్లు వెతుక్కున్నాను—మరి నువ్వు చేసే దేముం దిక?— ఆసలు నువ్వున్నావా? లేవా? — లేవు గాబోలు— ఉన్నావన్నది నా భ్రమ గాబోలు — అమ్మో, అపచారం — ఇలాంటి ఆలోచన కూడదు— కూడదు— దేవుడున్నాడు—లేకపోతే భూమ్మీద ప్రాణులు తిండెలా తింటాయి?— పిల్లల్నెలా కంటాయి? — నువ్వున్నావు, దేవుడా?— సందేహించానని కొత్త ఉపద్రవాలు తెచ్చిపెట్టకు. నేను సాధించలేనిది — నా తలకి మించింది నా మీద రుద్దకు — రక్షించు, దేవుడా! — కరుణించు— ఈ అజ్ఞానిని క్షమించు — క్షమించు— )

వాచీ చూసేడు. ఏడయింది. (అమ్మో! బజారు కెళ్ళాలి. కన్స్యూమర్స్ క్యూలో నించోవాలి. )

* * *

పదయింది.

ఆఫీసులో సీట్లో కూర్చోగానే ఎటెండరొచ్చి పిల్చేడు. "బాబు గారు రమ్మంటున్నారు."

(— ఏం కొంప మునిగింది —ఏం తప్పు చేసేను, దేవుడా—పాడుద్యోగం — అడ్డమైనాడూ సవారీ—(

వెళ్ళి చేతులు కట్టుకుని వంగి నిల్చున్నాడు ఆయనెదురుగా. "సార్!".

"కంగ్రాట్యులేషన్స్ య్" అంటూ ఆఫీసరు చెయ్యి ముందుకిచ్చేడు.

(—హమ్మయ్యో! ఇది ఉపద్రవం కాదు, ఆపద కాదు. మరేమిటి? మరేమిటి?— నాకు శుభమేమిటి—?)

రాఘవరావు [illegible] ప్పుడే ఉబ్బి తబ్బిబ్బయి పోయేడు. అతడు శరీరం తబ్బిబ్బురా ఆ వార్త హైడ్రోజనూ అయితే ఈపాటికి అతడు పైకి ఎగిరిపోయేవాడు.

"నీకు ప్రమోషనొచ్చిందోయ్. పార్టీ ఇవ్వాలి మరి" అంటున్నాడు ఆఫీసరు. (వీరు జోక్ చేస్తున్నారు — నాతో ఆడుకుంటున్నారు— వద్దు, సార్ — నా కంత దృష్టమా— )

"ఇవిగో ఆర్డర్స్. ఈ కాపీ మీద సంతకం పెట్టి తీసుకో — అన్నట్లు ట్రాన్స్ఫర్ కూడా చేసేరోయ్...."

వణికే చేతులతో రాఘవరావు అందుకున్నాడు (నిజమే. నాకు ప్రమోషనొచ్చింది. నిజమేనా? నాకేనా?—)సభ్యత అడ్డు రాకపోతే ఆ కాగితంముక్కని కౌగిలించుకుని ముద్దు పెట్టుకుని గెంతేవాడు. 'నాకు ప్రమోషనొచ్చింది' అని నడిబజార్లో కేకలేసేవాడు. నిజంగా మనిషికి మూడ్సని నిర్భయంగా ప్రదర్శించే కొనే స్వేచ్ఛ ఉంటే ఆ సమయంలో అతడింకేం చేసేవాడో అతడికి తెలీగు.

ఆఫీసులో మిగతా గుమాస్తాలు అభినందించేరు. మరి పదిమందినికన్నా ఫరవాలేదన్నారు. డబ్బు హోదా పెరిగాయన్నారు. తన కింద వాళ్ళమీద చెలాయించమని నొక్కి వక్కాణించేరు.

ఆ గుమాస్తా మిత్రుల్లో ఎప్పుడూ కీడుని మాత్రమే శంకించే ఒక గుమాస్తా మాత్రం "రాఘవరావు, ప్రమోషనొచ్చిందని మరీ సరదాపడకోయ్. ఉద్యోగంతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి. వరుస్తాలో కన్న వాసే మొదటికే మోస మొస్తుంది." అని పేడు.

(—నిజమే సుమా — నేను గుర్తించనే లేదు— పిల గుమాస్తా — నీకు ధన్యవాదాలు— కళ్ళు వేసేవు — )

ఆ రోజు ఆ వార్త ఇంట్లో కూడా ఆనందాన్ని వెలిగించింది. రాఘవరావు మాత్రం మరీ సంతోషంగా ఉండలేకపోయేడు.

రాత్రి కూడా సరిగ్గా నిద్ర పట్టలేదు. భార్య ఏదో చెబుతూంది. "ముందెళ్ళి అక్కడ ఇల్లు చూసుకుని రండి...."

రాఘవరావు ఆమె మాట వినడంలేదు.

(—బాబోయ్! బాధ్యతలు — రెస్పాన్సిబిలిటీస్ — అధికార్లు ఇంకెంత ఋణాయిస్తారో — ఇంకెన్ని సంజాయిషీలు అడుగుతారో — ఇప్పుడే ఉదయం పదికెళ్ళి రాత్రి ఎనిమిది కొస్తున్నాను — ఆదివారం కూడా వచ్చేస్తున్నాను — వారానికి కేడు రోజులే అయితే ఆ ఏడురోజులూ ఉద్యోగిస్తున్నాను. ఇంక దినాలు పెరగడానికేం లేదు—పని గంటలే పెరగాలి— రాత్రికూడా ఆఫీసులో పడుకొమ్మంటారుగావోసు— ఈ ఉద్యోగం ప్రమాదమే సుమా— ఈ ఆఫీసులోనే ఒక యూడీని ఫైనాన్సు బిల్లుల పొరపాట్ల గురించి సస్పెండు చేసేరు — మరొకతనికి ఎట్మనిస్ట్రేటివ్ గ్రౌండ్సులో కొండలమూలకి విసిరేసేరు. — ఇంకొకతనికి—ఇంకొకతనికిబాబోయ్, నాకీ ప్రమోషనొద్దు —వద్దు వద్దని రాసిచ్చేస్తే?—ఇప్పుడే ఈ రాత్రే పోయి ఆఫీసర్ కాళ్ళు పట్టుకుంటే— వద్దని రాసిమని చెప్పేస్తే — అందరూ నవ్వుతారేమో! వెక్కిరిస్తారేమో—వప్పుకోవాలా—వద్దా— వప్పుకోవాలా—వద్దా—పోనీ వెళ్దాం—చూద్దాం — [illegible]కడున్న అప్పులూ?—ఇంత మంచి ఇల్లు దొరుకుతుందో దొరకదో? — ఇలాంటి పని మనిషి, పాలవాడూ దొరుకుతారో దొరకరో? — ఇక్కడ్నుంచి ఈ సామానంతా ఎలా పట్టుకెళ్ళడం? — తక్షణం కొన్ని అప్పులయినా తీర్చి మరీ కదలాలి — తీర్చాలంటే ఏదో తాకట్టు పెట్టాలి — తప్పదు— పిల్లల టీసీలు పట్టుకెళ్ళాలి — అక్కడ సీట్లు దొరుకుతాయో దొరకవో?— ఎన్ని సమస్యలు? ఎన్ని చిక్కులు — ఎన్ని చికాకులు —?

* * *

బియ్యే ఫలితాలు ఈ వేళే తెలిశాయి. రా...




మృదువుగా...
మధురంగా వికసించే
సుగంధం.
ప్రతి క్షణాన్నీ చిరస్మరణీయం చేస్తుంది.

వాసు మరియు సైకిలు బ్రాండు అగరవత్తి.

ప్రకృతి మహత్యాన్నే మేము వశపరచుకొన్నాము...
ప్రకృతిసిద్ధమైన మంచు జాజాతపు సుగంధం కోసం. ఈ అద్భుతానికి ఆధారం ఏమిటి?
సాంప్రదాయం! తరతరాలుగా సంప్రాప్తమైన అగరవత్తుల తయారీలో అనమాన కళ.
ఇహ సుగంధం...అది మా స్వంత సృష్టి!
ఆహ్లాదకర మేళవింపుకు ఒక విశిష్టత ఉంది. ఆనందదాయకం.
మిమ్ము మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

ఎన్. రంగారావు & సన్స్
619, హండ్రెడ్ ఫీట్ రోడ్, పోస్టు బాక్సు 52, మైసూరు-570 004.
ఫోను:21227, టెలెక్స్ : 0846 : 219.

Sistas's-NR-124 Tel/77

రావు పెద్దకొడుకు సెకండ్ క్లాసులో పాసయ్యాడు. అతని తోటి గుమాస్తాల కొడుకులు ముగ్గురు పరీక్ష కెళ్ళారు కానీ తప్పారు. ఆరోజు రాఘవరావుని అందరూ అభినందించేరు. కొడుకు అందొచ్చాడన్నారు. మరీ పూచీ లేదన్నారు. పార్టీ ఇమ్మన్నారు.

చిన్నసైజు పార్టీ చెయ్యక తప్పలేదు —(హరి వెధవల్లారా! నెలాఖర్రా — నా దగ్గర డబ్బు ల్లేవురా? మీకందరికీ పై రాబడ్లున్నాయి—నాకవీ లేవు — మీకిచ్చిన పార్టీకి డబ్బు ఇంకేదో బడ్జెట్ లోంచి మిగలెయ్యాలి— నా ఆనందాన్ని మీరూ పంచేసుకున్నట్టు కనిపిస్తున్నారు గానీ, నాకు తెలుసు — నే నిచ్చిన పార్టీ సంగతి — నా కొడుకు పాసైన సంగతి—ఈ సాయంత్రమే మరిచిపోతారు. మీకివ్వడం శుద్ధ దండగ — దండగ — మరి మీకూ అనుకోడానికి వీల్లేదు — మీరిచ్చిన పార్టీలు నేనూ తిన్నాను. )

ఈ పార్టీ అయిపోయేక ఒక దుక్క గుమాస్తా రాఘవరావుని చేరబిలిచి "అయితే ఇక ముందేం చేస్తావోయ్— కొడుకుని పైకి చదివిస్తావా? ఉద్యోగం చూస్తావా?" అని అడిగాడు.

ఇంతవరకూ ఆ ఆలోచనే మరిచిపోయిన రాఘవరావు అంతరంగం గొల్లుమంది — (అవును సుమా! వాడ్నేం చెయ్యాలి? పైకి చదివించాలా? ఇప్పటికే ఆస్తులన్నీ తాకట్లో ఉన్నాయి — ఆడపిల్ల పెళ్ళీడు కొచ్చింది — ఇంకా పిల్లలున్నారు. వాళ్ళనీ చదివించాలి — పోనీ ఉద్యోగం వెతుకుదాం? బియ్యేతో ఏమొస్తుంది? బూడిద? — )

రెండురోజుల తరవాత కుర్రాడు మార్కుల జాబితా తెచ్చాడు.

"నాన్నా, ఈసంవవత్సర రిజల్ట్సు బాగాలేవు. నాకు యాభై అయిదు శాతం వచ్చాయి..." అంటూ చూపించాడు.

"చాలాసంతోషం, నాయనా!"(నిజంగా సంతోషం)

"ఎమ్మేకి పెట్టనా?"

"పెట్టిచూద్దా" (వద్దు, నాయనా, వద్దు. మరి నిన్ను రెండు సంవత్సరాలు చదివించే శక్తి నాకు లేదు — నీ తండ్రి దివాలా తీసేడు —)

"బియ్యీడీకీ పెడతాను"

"పోనీ పెట్టు." (బాబోయ్, వద్దు. నిన్ను ఏ స్కీము కిందనో సమితుల్లో పడేస్తారు. జీతాలివ్వరు.చేతగాని బీడీవోలూ—దద్దమ్మఇనస్పెక్టర్లూ—దూకుడు యీవోలూ నీ పీకెలమీద సవారీ చేస్తారు. బియ్యేవాడివన్న విలువుండదు. నే చూస్తున్నాను కదా—పంతుళ్ళ బాధలు, పోనీ హైస్కూళ్ళయితే నయం—అవి దొరకవే ? )

"ఎంప్లాయిమెంటులో రిజిస్ట్రేషన్ చేస్తాను. ఉద్యోగం దొరికితే మరీ మంచిది."

"చెయ్యి." (నీ తండ్రి సంగతి పసి కట్టేసేవా? బాధ్యతలు తెలిసేయా?ఉద్యోగం దొరికితే మంచిదే—కానీ దొరకదే—ఈ గుమాస్తా తండ్రి నీకే ఉద్యోగం చూసి పెట్టగలడు? డబ్బా లేదు—పలుకుబడీ లేదు—మరి ఎవడి కాళ్ళు పట్టుకోవాలి? ఏం చెయ్యాలి? ఎలా? ఎలా?— )

* * *

# తుఫాను

***కృత్రిమంగా తుఫానులు సృష్టించ గలిగిన మానవుడు ప్రకృతి సహజమైన తుఫానుల్ని నిరోధించలేక పోతున్నాడు.***

రాఘవరావు కూతురు పెళ్ళీడు కొచ్చింది. ఆమె చిన్నప్పుడు ఆరేడేళ్ళ వయస్సులో ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నప్పుడు ఏ స్తోత్రాల కార్యక్రమాల క్రిందా కట్నం పుచ్చుకొనేవాడ్ని పెళ్ళి చేసుకోబోనని ప్రమాణం చెయ్యలేదు. ఆమెకి పెళ్ళి కుదిరింది—కట్నం ఇస్తూనే.

ఒక సివిల్ సర్వెంట్ తన కొడుకులూ అల్లుళ్ళూ మళ్ళీ సివిల్ సర్వెంట్స్ కావాలని కోరుకోవచ్చు. ఒక డాక్టరూ, ఒక లాయరూ, ఒక ఇంజనీరూ తన వాళ్ళుతనలాగే కావాలని కోరుకోవచ్చు.వ్యాపారస్థుడూ, వ్యవసాయదారుడూ కూడా తన వాళ్ళు తన వృత్తి వాళ్ళే కావాలని కోరుకోవచ్చు. కాని ఒక గుమాస్తా, ఒక టీచరు తన పిల్లలూ అల్లుళ్ళూ గుమాస్తాలూ టీచర్లూ కావాలని కోరుకోరు.

కాని రాఘవరావు అనబడే గుమాస్తాకి కాబోయే అల్లుడు టీచరు. వాళ్ళ కుటుంబమూ మర్యాదా చూసి కుర్రాడి మంచితనం చూసి, నిరాడంబరత్వం చూసి, హిప్పీకాకపోవడం చూసి, బాగా ఎదిగిపోయిన పిల్లని చూసి, వస్తున్న సంబంధాలేవీ సరైనవి కాకపోవడం చూసి, కుర్రాడు బడిపంతులన్న ఒక్క అయోగ్యతనీ కప్పిపుచ్చుకుని, రాజీపడిపోయి పిల్లనిచ్చేసేడు. (—ఇప్పుడైతే అల్లుడు మంచివాడ్లాగే కనిపిస్తున్నాడు—ఏ అలవాట్లూ లేవల్లే ఉన్నాడు పెళ్ళయింతరవాత నేర్చుకుంటే? ఏం చెయ్యాలి? పిల్లదాని బ్రతుకేం కావాలి? మనిషిని అంచనా వెయ్యడం కష్టం—దేవుడే ఉన్నాడు—ఇక దాని అదృష్టం— )

విశ్వ ప్రయత్నాలన్నీ చేసి డబ్బు సంపాదించేడు. పెళ్ళవుతోంది. చుట్టూ సందడిగా ఉంది. మైక్‌లో పాటలూ, మంగళవాద్యాలూ, ముత్తయిదువల ముచ్చట్లూ, పువ్వుల ఊదొత్తుల కర్పూరపు హారాల పరిమళమూ, గందరగోళమూ, పురోహితుడి మంత్రాలూ ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి చూసే వాళ్ళకి.

రాఘవరావు కన్యాదానం చేస్తున్నాడు. ఇన్నాళ్ళూ పెంచిన పిల్ల ఇంకొకళ ఇంటికి పోతోందన్న సహజమైన దిగులుంది.

రాఘవరావు వియ్యంకుడు హాస్యాలాడుతున్నాడు.

ఒక పిల్ల భావకవి, బాగా తిని త్రేన్చి, "పెళ్ళంత ఆనందకరమైన సంఘటన జీవితంలో మరి లేదు" అంటున్నాడు.

రాఘవరావు ఆ మాట విన్నాడు.

(—నాబాధ నీ కేం తెలుసు, నాయనా! పిల్ల కాకివి?—పెళ్ళి శుభవే...ఆనందవే....ఎప్పుడు ? చేతినిండా డబ్బుండాలి—డబ్బు చాలు—అన్నీ ఉన్నట్లే—అదుండాలి మరి. నేనేమవుతున్నాను. అప్పుల్లో కుమిలి పోతున్నాను. అవన్నీ ఎన్నాళ్ళకి తీరుస్తాను ? నా జీతం సరిపోతుందా ? జీవితం సరిపోతుందా? అబ్బాయి చెయ్యేనా కలుస్తుందంటే వాడికి ఉద్యోగం లేదే ? బట్టలు అరువు—బియ్యం అరువు — కిరాణా అరువు—వీళ్ళంతా రేపు ఇంటి మీద పడితే ? ఈడులు కూడా బాగా పడ్డట్టు లేవే? ఇంతకుముందుగానే వేసిన వాళ్ళంతా వేస్తే బావుండేది ? ఆ మనుషులే పెళ్ళికి రాందే? ఇంకా ఖర్చులున్నాయి—ఏం చెయ్యాలి? వెంటనే అబ్బాయికీ చేసేస్తే? ఆ కట్నంతో బాకీలన్నీ తీర్చొచ్చు. అయినా వాడికి అప్పుడే ఎందుకు పెళ్ళి—ఉద్యోగం కూడా లేదు—ఇక వాడి పెళ్ళాన్ని—ఆ తరువాత—పిల్లల్ని—నేనే పోషించాలి. బాబోయ్,వద్దు—వద్దు. )

* * *

ఒకసారి రాఘవరావు ఏంజేసుకుంటూ ఆఫీసులో తన గదిలో కూర్చున్నాడు. ప్రక్క గదిలో గుమాస్తా సోదరుల కబుర్లు కూడా యాథాలాపంగా వింటున్నాడు. వారి మాటల మధ్యలో "మన రాఘవరావు గొప్ప నిజాయితీపరుడోయ్. పైసా లంచం తినడు. అని ఒకడన్నాడు. మరోడు "అతను చాలా మంచివాడు సుమా! నిప్పులాంటి మనిషి..." అన్నాడు.

(—ఆహా ! నా గురించి ఎంత మంచిగా చెప్పుకొంటున్నారు ? ముఖస్తుతికి ఇంద్రుడనీ చంద్రుడని అనొచ్చు. వెనక అనుకున్నవే నిజం—ఆ కీర్తే నే నాశించింది. ఆ పరువొక్కటే నాక్కావలసింది. దాని గురించి జీవితాన్ని పణంగా పెట్టొచ్చు. ఎన్ని ఇబ్బందులు పడితేనేం? తిండి లేకపోతేనేం—అయితే నిజంగా నాకు లంచం తినాలని లేదా? ఉందా ? కుటుంబం ఇబ్బందులు పడుతున్నప్పుడూ—తాకట్లు పెటుతున్నప్పుడూ అలా అనిపించడం కద్దు—నిజం ఒప్పుకోవాలి. కాని, లంచాలే తింటే కక్కుర్తి పడితే అలా మంచిగా చెప్పుకోరు. ఆఫీసరుకిలాగే నన్నూ వెనక తిడతారు—ఛీ—అదీ ఒక బ్రతుకేనా? నిజాయితీ కావాలి మనిషికి—నిజాయితీ — వెధవ నిజాయితీ— నీ నిజాయితీ ఎవడిక్కావాలి ?—ఏదో రూపేణా సంపాదించినవాడే సుఖంగా ఉన్నాడు ఆఫీసర్లాగా? అతనికేం? ఎవరెన్నను కుంటేం—దర్జాగా ఉన్నాడు — నిజాయితీవల్ల నా కొరిగిందేమంటే అప్పులు—పాట్లు—ఛీ...అలాటి ఆలోచన్లు రాకూడదు — నిజాయితీ మనిషికి ప్రాణం. నేను మంచివాడుగానే ఉద్యోగించాలి. మంచివాడుగానే రిటైరవ్వాలి—మంచివాడుగానే చావాలి—మచ్చ పడ్డానికి వీల్లేదు—వీల్లేదు )

* * *

నెలాఖరు.

ఆ నాటికి రాఘవరావు ఆస్తి ఆరు రూపాయలు.

ఒక గుమాస్తా టీ ఇచ్చి "నీ దగ్గరో పైవున్నాయోయ్ ?" అనడిగేడు.

"ఉన్నాయి గానీ..." (లేవు అనడమెలాగ? )

"ఉంటే ఇయ్యి...మళ్ళీ ఇచ్చేస్తాను..."

"నాకూ అవసరాలుండొ్యోయ్.......అవే ఉన్నాయి..."

"ఇద్దా—నీ కవసరమొస్తే నే నిస్తాను..." ఇచ్చేడు.

ఆరోజే భార్యకి బాగా జ్వరం వచ్చి మందులు

కొనడానికి అయిదు రూపాయిలు అవసరమయ్యేయి. అప్పుడు రాఘవరావు చికాకుపడ్డాడు. ( —వాడు అడిగిన వెంటనే అసలే లేవని ఎందుకు చెప్పలేక పోయేను ? ఉన్నా ఇవ్వనని ఖచ్చితంగా ఎందుకన్లేక పోయేను ? ఇప్పుడు నా అవసరానికి ఎవడి కాళ్ళు పట్టుకోవాలి ? ఆ వెధవనే అడిగితే? అన్నాడు గానీ ఇవ్వడు—లేకే అడిగాడుగదా !— ఛీ —ఎంత పంజేసేను ? అన్నట్టు మందుల కొట్టువాడు అరువిస్తాడేమో అడగాలి— )

* * *

రాఘవరావుకి డబ్బు అవసరమై బాంకులో ఒక నగ తాకట్టు పెట్టాలని బయల్దేరేడు. అంతకు ముందే ఆ బాంకులో ఒకటుంది—బాంకు వారు ఒకసారి అప్పున్నవాడికి మళ్ళీ ఇవ్వమన్నారు. రాఘవరావు ఇబ్బంది పడిపోయేడు. అంతలోనే బాంకువారు మరో సలహా ఇచ్చేరు. "ఇప్పుడు అప్పులేని మీకు తెలిసిన వాళ్ళ నెవర్నైనా తెండి....ఆయన పేరుమీదిస్తాం..."

సంతోషంగా మనిషిని వెతుకుతూ బయల్దేరేడు. ( ఛీ. వచ్చిన జీతం లెక్క తెలీకండా ఖర్చవుతోంది. గంపెడు కుటుంబం నా రక్తం పీల్చేస్తున్నారు. మరి అదంతా నా కుటుంబమే కదా ! ఇంటి యజమాని అన్న గోట ఎన్యూమరేషన్ పుస్తకంలో సంతకం పెడుతున్నాను? పోషించక తప్పుతుందా ? ఈ ఉద్యోగం చేసి నేనేం సుఖపడ్డం లేదు. )

ఎదురుగా ఒక గుమాస్తా మిత్రుడొస్తున్నాడు. అతన్ని పట్టుకొని ఎత్తుకున్నంత పన్జేసి..."నీకు స్టేట్ బాంక్‌లో గోల్డు మీద అప్పుందా" అనడిగేడు.

"లేదు. ఏం ?"

"హమ్మయ్య—నువ్వే దేవుడివి...రా....రా..." (ఈ క్షణంలో తన కెవడు దొరికితే వాడే దేవుడు. )

"నే నెందుకు?"



ఆంధ్ర ప్రదేశ్ లో ఏజన్సీలు ఇవ్వబడుచున్నవి
Vijaya Advtg

రాఘవరావు చెప్పేడు — అతడు వచ్చేడు. అతని పేరుమీదనే అప్పు తీసుకున్నాడు.

ఆ రాత్రి రాఘవరావు అతుకుల బొంతమీద భార్యకి బారెడు దూరంలో పడుకొని—"అమ్మయ్య. అవసరాలు గట్టెక్కేయి" అని నిట్టూరుస్తూ ఉదయం ఉదంతం చెప్పేడు.

భార్య అడిగింది: "అయితే బాంకులో అప్పు అతగాడి పేర్నే ఉందన్న మాట..."

"ఉంది."

"అంటే...మీ పేర్న లేదన్న మాట."

"లేదు."( పేరు నాది కాకపోతే వస్తువు నాది కాదా ! )

"ప్రస్తుతం బాంకువాళ్ళ దృష్టిలో ఆ వస్తువు అతగాడిదైనట్టేగదా !"

"అవును" ( ఆడవాళ్ళకి అనుమానాల్లావు. )

"ఆ వస్తువు అత డొస్తేనే—సంతకం పడితేనే ఇస్తారు—మీరెళ్తే ఇవ్వరు...అవునా ?"

"నిజమే" ( ఎందుకీ పీకుడంతా? )

"ఆ వస్తువు...ఆ డబ్బుతో మీకు తెలీకుండా అతగాడే విడిపించేసి దచేస్తే ? అమ్మేస్తే ?"

"అతగాడు చాలామంచివాడు."(హమ్మ రాస్కెల్! ఏం పాయింటు చెప్పేవే? నిజమే. ఆ వస్తువు నాదండానికి గుర్తేవుంది? వాడెల్తాడు. బాంకు వాళ్ళిచ్చేస్తారు. ఈసాట్న నేనెళ్ళి అడిగినా ఇవ్వరు. వాడి వెనక లిఫగాలిగా మోసు? ఎప్పుడు విడిపించాలన్నా వాడ్నే రమ్మని బతిమాలాలి? ఇంగా వాడికి బదిలీ అయిపోతే—ఏ ఆర్నెల్లనాడో నే విడిపించబోయే టప్పుడు వాడ్నెమోసుకురావాలి. ఈలోగా వాడు దాన్ని తీసుకొని అమ్మేస్తే ? ప్రతిరోజూ వెళ్ళి బేంకులో వస్తువుందో లేదో కనుక్కుంటూ ఉండాలి. లేదంటే ఇప్పుడే వెళ్ళి నా వస్తువు విడిపించేమంటే? డబ్బెక్కడిది ? ఎంత పన్జేసేను. ఇప్పుడు గుర్తొస్తోంది. వస్తువు మరో బాంకులో—ఆంధ్రా బాంకులో పెట్టాల్సింది. రాఘవరావ్వూ ! భడవా? నీబుద్ధేమయిందిరా? వినాశకాలే—ఆ వస్తువు ఆ వెధవ కొట్టేస్తాడు—తప్పదు—తప్పదు. ఎలాగో త్వరగా విడిపించాలి—విడిపించెయ్యాలి.

ఆ రాత్రి మరి నిద్ర పట్టలేదు.

* * *

ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రాజకీయ పార్టీ ప్రాబల్యం బాగా ఉంటుంది. ఉద్యోగులు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనకూడదు అన్నప్పటికీ ఇది పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేసే అన్ని తరహా ఉద్యోగులు మాత్రం ప్రత్యక్షంగా పాల్గొంటూ ఉంటారు. అనివార్యం.

రాఘవరావు ఇంతకుముందు పంజేసినా సమితిలో ఒక పార్టీ బలంగా ఉండేది. అతడి ఆఫీసుతో సంబంధమున్న రాజకీయవేత్తలందరూ ఆ పార్టీ వారే. కాబట్టి అతడు కూడా ఆ పార్టీ గురించి పంజేసి 'ఈ పార్టీ గొప్పది. ఈ నాయకులు గొప్పవారు' అనిచెప్పి మెప్పులు పొందేడు. ఆ పార్టీనే నమ్మినట్టు కనిపించేడు. నమ్ముతున్నాననే అనుకున్నాడు.

ఇక్కడి కొచ్చేక ఈ సమితిలో మరో పార్టీ బలంగా ఉంది. ఈ నాయకులు ఈ పార్టీవారు. ఇక్కడ కూడా రాఘవరావు పంజెయ్యక తప్పలేదు. 'ఈ పార్టీ గొప్పది. ఈ నాయకులే దొడ్డవారు' అంటున్నాడు. నమ్మేస్తున్నాడు కూడా.

అది గుర్తించిన భార్య సరదాగా—"ఆవేమిటండీ—పార్టీ మారిపోయేరు?" అంది.

"పొలిటిక్స్ సంగతి నీ కేం తెలుసు? ( కానీ, —నువ్వూ అనేసేవే? నా కసలు మొరేల్ లేదనేగా నీ ఉద్దేశం? నీ సొమ్మేం పోయింది? పైన నలుగురిలో తిరిగొచ్చింది నేను—ఈ ఉద్యోగం నాది ఈ చర్మం నాది—ఈ వీపు నాది—ఏ పార్టీ అంతేనా కేం? నా కొరిగిందేముంది? ఎవరు పదవిలో కొస్తే నా కేం? దేశం ఏమయినా నాకేం ? నా గుమాస్తా బతుకు మారదు. నా అప్పులు మారవు. నా కష్టాలు మారవు. పార్టీలూ సిద్ధాంతాలూ నా కేల? గెలిచిందే మన పార్టీ.సీట్లో ఉన్న వాడే మనవాడు—చుట్టూన్న జనం అరిచిందే మన వివాదం.

* * *

ఇన్నాళ్ళ జీవితం తనూ రాఘవరావు చెప్పుకో దగ్గ మిత్రుల్ని పొందలేక పోయాడు. చిన్నప్పు డెప్పుడో ఒకటనితో స్నేహం చేశాడు. అతడినుండే బీడీలు, ఇప్పుడు సిగిరెట్లు అలవాటయ్యాయి. తండ్రి కోప్పడ్డాడు. చెడు సావాసాలు చెయ్యొద్దన్నాడు. చేసిన సాహసమల్లా చెడే అవచ్చని అనుమానంతో రాఘవరావు అందరికీ దూరంగా ఉండిపోయాడు.

( నా కెందుకు? ఇంకొకడితో స్నేహం చేస్తే పేకాట రావచ్చు—మరొకడితో తాగుడు రావచ్చు స్నేహితులు దూరంగా పోతారు అలవాట్లు మిగిలి పోతాయి. స్నేహితులు అప్పడుగుతారు. నే నివ్వ లేను. వాళ్ళతో తిరగమంటారు. చెత్తకబుర్లనీ చెబు తారు— వినాలి. ప్రేమకథలుకూడా వినాలి—ఎవడెలాటి వాడో తెలీదు వాడెనక కొన్నాళ్ళు తిరిగి అహర్నిశలూ కనిపెట్టి వాడి సంగతి తెలుసుకోవాలి. ఈ లోగానే మోసం జరగొచ్చు—ఎందు కొచ్చిన బాధ ఇదంతా? కొందరు స్నేహితుల్లాగే కనిపించుతారు. చంపు తారు బ్లాక్‌మెయిల్ చేస్తారు. సంసారం రచ్చకెక్కిస్తారు? వాళ్ళ కో దండం నా మానాన్న నేను ప్రత గ్గంను. )

* * *

రావువరావు మీద ఆఫీసరుకి మంచి గురి కుదిరింది. అతడిలో ఒక విశ్వాసపాత్రుడైన గుమాస్తా కనిపించాడు. ఆ గుమాస్తానే అతడు ఆదరించాడు. ఆ గుమాస్తానే అతడికి దగ్గరయ్యాడు. అది స్నేహం కాదు—పరిచయం కాదు-బాల్యసీహో కూర్చున్న వ్యక్తి నేలవాడి సీటు దగ్గర కొస్తే నేలవాడు సాదరంగా కూర్చోనివ్వడం లాంటిది. ఆ రాచుకు తిరగడంలోనే రాఘవరావు తనకి తెలియకుండా ఆఫీసరుకి ఎన్నో ప్రయోజనాలు కూర్చి పెట్టాడు. అది అంతటితో ఆగలేదు. ఆడవాళ్ళకి ప్రాకింది. రాకపోకలు,పేరంట్లు, పిల్లలు కలిసి తిరగడాలు మొదలయ్యాయి.

ఆఫీసరు తాతల్నాటి నుండీ డబ్బున్న వాడే దానికితోడు జీతం, హోదా గల ఉద్యోగం దేశంలో పలుకుబడి ఉన్న ఉద్యోగులతో అతనికి పరిచయమై ఉంది. రేపో నేడో ప్రమోషన్ మీద పోతాడు. అతడి గుండె కాదు చెరువు. అవి చేతులు కావు. అందిందల్లా జేబులో వేసుకునే చెమ్చాలు. అయనకి రాబడికి

ఖర్చుకి తేడా తెలీదు. ఆయనింట్లో ఖరీదైన బట్ట లున్నాయి, ఖరీదైన నగలున్నాయి, ఖరీదైన ఫర్నిచరుంది. ఖరీదైన రేడియో ఫ్రిజు ఉన్నాయి. వేయేల ఖరీదైన లగ్జరీ ఉంది.

అవన్నీ చూసి ఊరుకోలేక రాఘవరావు భార్య ఇండెంట్లు ఎక్కువ చేసింది. కొన్నిటి పేర్లు చెప్పి. . . "జీతాలొస్తే ఇవి కొనండి" అంది.

"నాకూ కొనాలనే ఉంది." ( పిచ్చిదానా. కొనడం సాధ్యంకాదే నీ మొగుడికి ఒక చేత్తోనే రాబడి వస్తూంది ఆ డబ్బు కనీస ఖర్చులకే చాలదు. బాంకులో వస్తువులు తాకట్లున్నాయి. అప్పులున్నాయి. కుర్రాడిని చదివించలేదు పైకి. ఉద్యోగమూ లేదు సామెజెప్పిన ట్టుంది—మింగడానికి మెతుకు లేదట. )

మరో రోజు ఆఫీసరుగారి అబ్బాయి చేతిలో గోల్డ్ చైన్ రిస్టువాచీ గుమాస్తాగారి అబ్బాయి చూశాడు. కావాలన్నాడు. అల్లరికూడా చేశాడు. "పిడూరుకోడండీ ఒకటి కొంటే?" అంది భార్య.

"చూద్దాం." ( ఎంత తేలిగ్గా అన్నావే? గోల్డ్ చైన్ రిస్టువాచీ కొండదామంటే మాటలా? వంద లుండాలి. ఈ గుమాస్తాగాడు అలాటి కోర్కెలు తీర్చగలడా? కుర్రాడు అలాటి వాచీ కట్టుకు తిరుగుతుంటే నాకూ చూడాలని ఉంది—కాని ఎలా?

ఆ సాయంత్రం బజారు వెంట వడుస్తుంటే ఒక ఆలోచన మెరిసింది. వెంటనే ఒక వాచీ కొనేసి ఇంటికి తెచ్చి కుర్రాడి చేతికి కట్టి "ఇదే నాన్నా. నువ్వు చూసిన వాచీ" అన్నాడు ( బాబూ. నిన్ను మోసం చేస్తున్నాన్రా. ఇదీ గిల్టు కానేకాదు చైన్ రిస్టువాచీ. గోల్డ్ చైన్ రిస్టువాచీ కాదు. ఈ గిల్టు నీ కోసమే పుట్టింది—నీ తండ్రి కోసమే పుట్టింది.)

ఈ ప్రహసనం అంతటితో ఆగలేదు.

ఈ కుర్రాడు ఆ వాచీ కట్టుకుని ఆఫీసరు ఇంటి కెళ్ళాడు. వాళ్ళ జ్ఞాన మెరిగిన అబ్బాయి ఇది బంగారంది కాదనీ, తన తమ్ముడి చేతిలో ఉన్నది అసలే కాదనీ నిజం చెప్పేశాడు.

రాఘవరావు కుర్రాడు ఇంటి కొచ్చి వాచీ విసిరేసి ఏడ్చాడు. విసిగి రాఘవరావు వాడిని తన్నాడు. దాంతో వాడు జ్వరం వచ్చి మంచం పట్టేడు. గోల్డ్ చైన్ రిస్టువాచీ ఖరీదుకన్నా ఎక్కువ పెట్టుబడి వాడి శరీరం క్రింద అయింది.) చివరికి వాడు కోలుకున్నాడు.

రాఘవరావు ఈ గొడవలతో నీరసించిపోయాడు.

( ఇదంతా ఎందు కిలా జరిగింది? కారణ మేమిటి? తప్పెవరిది? నా జీవితంలో ఆఫీసర్లాంటి స్థితి పొందలేను? అందులో ముప్పావొంతయినా అనుభవించలేను. ఊహించనూ లేను. మరి అలాంటి వాళ్ళతో పరిచయం ఎందుకు పెంచుకున్నాను. పెంచుకున్నా అవి ఇంటందరికీ ఎందుకు తగిలించాను—బాబుని రక్షించుకోవడం ఎంత కష్టమై పోయింది? వాడి కింతా వాచీ మూలంగానే వచ్చింది. అలా కాకపోయినా ఆ కష్టం ఇంకో విధంగా వచ్చేదేమో—కర్మకి ఎవరేం చేస్తారు? కాదు, కర్మకాదు. కోరి తెచ్చుకున్నదే-వాచీ వల్ల తెచ్చుకున్నదే—వాచీ గొడవ వాళ్ళతో రాసుకు తిరగడంవల్ల తెచ్చుకున్నదే అంతా నేను చేసుకున్నదే—సందేహం లేదు — స్వయంకృతాపరాధం. )

* * *

ఆదివారం. ఆఫీసునుండి రాఘవరావు సాయంత్రమే ఇంటికొస్తున్నాడు. బజారు మీరించి వచ్చి ఏవో కొనుక్కుపోవాలని అతని ఉద్దేశం.

బజారుగుండా నడుస్తుంటే దూరం నుండి ఒక పరిచయమైన శాల్తీ కనిపించి పరిశీలించి చూశాడు.

ఆమె... ( ఆమేనా? ఆమే— )

అవును, ఆ నడకా—ఆ కదలికా ( అవే—అవే )

ఇటే వస్తోంది. ( రాఘవరావుగారు ఈ ఊళ్ళో ఉన్నారని తెలిసి వెతుక్కుంటూ వస్తూందా? )

దగ్గరగా వచ్చింది— ( ఆమే—ఆమే )

హాలో! ( పలకరించానా పలకరించాలని అనుకుంటున్నానా? )

ఇంకా దగ్గరగా... ( నా వైపే చూస్తూంది. అరె, నన్ను దాటి పోతూంది. చాలా కాలమైంది కదూ చూసి—పోల్చలేక పోయిందేమో—నేనే కేకేస్తే? )

ఆగింది— ( ఆగిం దాగింది )

"ఎవరు—రాఘవరావుగారా!" ( అవును, నేనే—నీ రాఘవరావునే, అప్పుడు-ఇప్పుడు అదే గొంతు—అవే కళ్ళల్లో మెరుపు—

రాఘవరావు ఆగాడు. అతని ఆలోచనలు, చైతన్యం ఆగిపోయాయి. తిరిగి పలకనూలేడు. మనసంతా ఆమె వ్యాపించి అతన్ని శూన్యుడిని చేసింది.

"మిమ్మల్నేనండి" అం దామె. ( నన్నేనా: నన్నే కదూ. )

అప్పుడు తేరుకుని పలకరించాడు.

"ఎన్నాళ్ళకి?" ( అప్పటికీ ఇప్పటికీ అదే అందం—అలంకారాలు అవసరం లేని అందం-వయస్సు చెప్పలేని సౌందర్యం. )

ఆ తరవాత ఆ ఇద్దరం జనసమ్మర్దానికి దూరంగా పబ్లిక మైదానంలోనికి-ప్రశాంతమైన వాతావరణంలోనికి పోయి కూర్చుని కొన్ని దశాబ్దాల వెనక జీవితపు పుటల్ని తిరగేసుకున్నారు. ఎన్నెన్నో అనుభూతులు కథలుగా గుండె లోతుల్లోంచి పంచుకున్నారు. ఆవిడ టీచరుగా, అతను గుమాస్తాగా ఉన్నప్పటినుంచి ప్రేమించుకుని, విడిపోయి, వేరువేరుగా పెళ్ళిళ్ళు చేసుకుని, వేరువేరు జీవితాలు ప్రారంభించి, వేరు వేరుగా పిల్లల్ని కని, ఇదిగో ఇలా యాదృచ్ఛికంగా మెట్టాలింటికి ఆమె—ఉద్యోగరీత్యా అతనూ ఈ బజార్లో కలుసుకున్న దాకా చెప్పుకున్నారు. ఆ క్షణంలో ఆ ఇద్దరూ కాలమూ గ్రహాలగ మనమూ స్తంభించి పోయినట్లు భావించారు. ఆత్మల్లోంచి మమతల జలపాతాలు లేచి ఐక్యమై ప్రవహిస్తున్నట్టు కలగన్నారు.

నే నెంత పొరపాటు చేశాను? ఈమెని పెళ్ళి చేసుకోవాల్సింది—ఇంతందమూ నాదయ్యేది—అంత కన్నా మరో చేతి సంపాదన అదనంగా కలిసేది—ఎన్నో కష్టాలు గట్టెక్కేవి ఆ చీర ఆ నగలూ చూస్తే బాగా డబ్బు మిగులుస్తున్నట్టుంది—లేకపోతే భర్త సంపాదనేమో? పెద్ద ఉద్యోగస్థుడని చెబుతూంది మరి అప్పుడు పరిస్థితులకి లొంగి నేరం చేసేను. ఆవిడ్ని భార్యగా పొందే అదృష్టం నా కెక్కడిది? మరో చేతి సంపాదన కలిసే భాగ్యం నా కెక్కడిది? ఇప్పుడైతేనేం? నా మీద అభిమానం ఆ మాత్రం లేదా? కూతురు పెళ్ళి చేసేనని కొంత సాయం చెయ్యమంటే? అప్పుగానే—అడిగితే తప్పా? తప్పు కాదా? ఇస్తుందా ఇవ్వదా? ఎప్పటిదో ఈ ప్రేమని ఎత్తిచూపి డబ్బు కోరుతున్నా ననుకుంటుందా కాని ఇన్నేళ్ళ తరవాత కలిస్తే, డబ్బడిగితే ఏం బాగుంటుంది? ఈమె కనిపించకపోతే ఏం చేసేవాడ్ని? కనిపించనే లేదని అనుకుందాం ఈ కలయిక తియ్యని స్మృతి ఎన్నాళ్ళో ఉంటుంది. బ్రతుక్కి కొత్త ఆనందా నిస్తుంటే—పోనీ ఇక్కడ కొన్నాళ్ళుంటుందేమో అడుగుదాం — ఉన్నన్నాళ్ళూ కలిసి తిరిగి చివరికి ఒక సారి డబ్బడిగితే? అలాగే చేద్దాం. )

* * *

రాఘవరావుకి వయోభారం పెరుగుతూంది. దేశంలో బ్యూరోక్రసీ అనే యంత్రంలో ఈ చిన్ని చక్రం ఇంకా తిరుగుతూనే ఉంది. ఇది పూర్తిగా అరిగి పోయిందని ప్రభుత్వం వారు ప్రకటించి దీన్ని తీసి పారెయ్యడానికి మరో ఆరేళ్ళ వ్యవధి ఉంది. ఇంత వరకూ ఊహల పట్టాల మీద అబద్ధాల రైలు నడుపుకుంటూ అనుకోని స్టేషన్ల వైపు ప్రయాణించాడు. ఆ ప్రయాణంలోని కొన్ని అమూల్యమైన అనుభూతులు చిత్రపటాలు జ్ఞాపకాల ముఖమల్ తెరల క్రింద గుండె గోడల మీద పదిలంగా దాచాడు. తీరిక దొరికినప్పుడల్లా ఆ తెరలు తొలగించి బొమ్మలు చూస్తూ అహర్నిశలూ నిద్రాహారాలు మరిచిపోతాడు. అది నెలాఖరు.

ఆఫీసులో రాఘవరావు దగ్గరికి మరో గుమాస్తా వచ్చాడు. "టౌన్‌లోకి మంచి సినిమా వచ్చింది వెళదామా?" అనడిగాడు.

"నా కంతగా రావాలని లేదోయ్."

"కొంత రావాలని ఉంది కదా. పదండి వెళదాం."

"ఆలోచిద్దాం." (వెధవ వీడి సొమ్మేం పోయింది?) వీడి కుటుంబమంతా కలిసి ముచ్చికాయ ముగ్గురు ఖర్చు లేదు. సినిమాకి కెళతాడు, షికార్లు కెళతాడు. నా కెలా కుదురుతుంది నా కున్న ఖర్చులూ కష్టాలూ



సేల్సు బ్రాంచిలు:
మెయిన్ రోడ్, రాజమండ్రి.
శివాలయం వీధి, విజయవాడ.
మ్యునిసిపల్ మార్కెట్, సికిందరాబాదు
హైదరాబాదు
SUVARNA

లోకంలో మరెవడికీ లేవు. అవి నాకే ప్రత్యేకం.)

"మీ టికెట్టు నేనే పెడతాను. భయం లేదు."

(హమ్మ, భడవా. వీడు నాకు టిక్కెట్టు కొంటే తాట్ట నేను కట్టుకోలేననుకున్నాడు గావాల అక్కడికి వీడే ఉన్నవాడైనట్టు నేనే లేని వాడినైనట్టూ వీడే ఖర్చు పెడుతున్నట్టూ నేనే పిసినార్నయినట్టూ)

ఇద్దర్లూ సినిమా కెళ్ళార

సినిమా వె దలయింది.

హీరో పేదవాడే తండ్రి రిక్షా తొక్కి చదివించాడు హీరోకూడా తిండీ నిద్రా మానేసి చదివాడు. (నా తండ్రి నా చిన్నప్పటికి స్తోమతపరుడే చదివించేవాడే నాకు చదువబ్బ లేదు.)

హీరో ఫస్టుక్లాసులో పాసయ్యాడు. వెంటనే ఉద్యోగం దొరికింది (ఆకాలంలోకూడా తంటాలు పడితేగానీ నాకీ ఉద్యోగం రాలేదా నా కొడుకు బియ్యే పాసై పదేళ్ళయినా ఉద్యోగం లేదు)

హీరో హీరోయిన్లూ ప్రేమించుకున్నారు. (మరేం పని? అప్పుడేదో నేనూ ప్రేమించేను కానీ, ప్రేమంతా బూటకం... దగా.)

ఆ ఇద్దరూ పార్కుల్లో—బీచిలో సిగ్గు లేకుండా దొర్లేరు. (నే నెన్నడూ పంతులమ్మ చేతి గోరైనా తాకలేదు.)

పరిస్థితుల దృష్ట్యా విడిపోయారు. (మేమూ విడిపోయాం)

హీరోని మరో పిల్ల ప్రేమించింది. కాని అతడామెని 'చెల్లీ' అని పట్టుకున్నాడు. ఆమెకూడా 'అన్నయ్యా' అని మొరోమంది. (నాన్సెన్స్!)

హీరో తండ్రి బలవంతంమీద మరొకమ్మాయిని చేసుకున్నాడు. (నేనూ చేసుకున్నాను.)

ఆ ఇద్దరూ కలిసి కాపరం చెయ్యలేదు. (నేను ఆరుగురు పిల్లల్ని కన్నాను.)

హీరోకి సంవత్సరానికి నాలుగు ప్రమోషన్లు— (పాతికేళ్ళ సర్వీసులో నా కొక్కటే ప్రమోషను.)

మరి కొన్ని లాగులాటలూ, పీకులాటలూ అయి వాక, ఏడుపులూ పెడబొబ్బలూ, ముష్టియుద్ధాలూ, పరుగుపందాలూ అయింతరవాత తెరమీద కునుషు లందరూ గ్రూపుగా నవ్వారు. (శభాష్—ఈ సినిమా ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌కి తీసుకెళ్ళాలి.)

జనగణమన.

లేచి హాలు బయటి కొచ్చారు. మిత్రుడు అక్కడి నుంచే ఇంటికి రిక్షా ఎక్కేశాడు.

రాఘవరావు నడుస్తున్నాడు ముందుకి.

* * *

బ్రైన్ పదయింది.

ఆ సినిమా అతడి మెదడులో ఏవో పొరలు పగలదీసింది. నడుస్తూ ఆలోచిస్తున్నాడు—ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఎన్నో సంఘటనలు ప్రియమైనవీ అప్రియమైనవీ మనస్సు మీద తిరుగుతున్నాయి. (బాల్యమూ-టీచర్లూ-దెబ్బలూ-బడి దొంగతనమూ-చెడు స్నేహాలూ—దురలవాట్లూ—ఉద్యోగాన్వేషణ—అధికార్లూ-అనధికార్లు-తోటి గుమాస్తాలు ఆడాళ్ళూ మగవాళ్ళూ-అవమానాలూ మెప్పులూ రాజకీయాలూ-పంతులమ్మా—ప్రేమా-పెళ్ళి తప్పడం-కారణాలూ-పెళ్ళీ పిల్లలూ-పెద్దవాడు ఉద్యోగం లేకుండా తిరగడం-ఆడపిల్ల పెళ్ళీ—అప్పు—పిల్లల చదువులూ—అప్పు-జీతమూ—అప్పు—జీవితమూ—అప్పూ.)

ఇంటికి వెళ్ళాలనిపించలేదు. నిన్న పంతులమ్మతో కూర్చున్న చోటికి పోయాడు. (ఆమె మళ్ళీ కనిపిస్తే బాగుండేది. ఉదయాన్నే వెళ్ళిపోతానని చెప్పింది. వెళ్ళే ఉంటుంది—ఎందుకనిపిస్తుంది? ట్రైన్ తప్పోయి ప్రయాణం ఆగిపోకూడదూ—ఆగదు-నా కా అదృష్టం ఉండదు. ఒక వేళ ఉన్నా తప్పకుండా కలిసేది. కలిసేదా? నిజంగా ఆమె భర్త పెద్ద ఉద్యోగి. నా లాంటి వాళ్ళు పది మంది ఆయన కనుసన్నల్లో ఉంటారు. మరి నే నామెకి ఎందుకు గుర్తుంటాను? ఉండను—కాదు, ఉంటాను. నన్ను మనఃపూర్తిగా ప్రేమించింది. అసలు ప్రేమన్నది ఉన్నదా? భ్రమేనా! వయస్సు ఆకర్షణా? ఇప్పుడు నే నెవర్నన్నా ప్రేమించ గలనా? ఆమెతో కల కొద్ది గంటల్లోనే కరిగి పోయింది—ఎంత ఖరీదైన చీర కట్టుకుంది! ఎన్ని నగలున్నాయి! ఆమె కేం? నేనే బికారినై పోయాను. అనుకున్న డబ్బు అడగ లేకపోయాను తెగించి అడిగేయాల్సింది—పొరపాటు చేశాను.)

ఆ స్థలం దాటి ఇంకా ముందుకి పోయాడు—యంత్రం లాగ నడిచేస్తున్నాడు. (చల్లగా గాలి వీస్తూంది—ఆమెని ధ్యానిస్తూ వందల మైళ్ళు నడవచ్చు శ్రమ లేకుండా—వెన్నెలకూడా ఉంది—వోహ్ చిన్నప్పుడు బొమ్మలు గీసేవాణ్ణి. బాగా పాడేవాణ్ణి. అవన్నీ ఇప్పు డేమయ్యాయి. ఆఫీసూ నా ఇల్లూ—ఎద్దునై పోయాను, మొద్దునై పోయాను. ఒక యంత్రాన్నై పోయాను. నాలో విలువలు చచ్చి పోయాయి. ఉత్సాహం నశించింది. నే నెందుకూ పనికిరాను. ఇలా ఆరుబయట కెప్పుడైనా వచ్చేనా? ఆహ్, వెన్నెల ఎంత బాగుంది? వెన్నెల తెల్లగా ఉంది. వెన్నెల ట్యూబ్ లైటు వెలుతుర్లా ఉంది—కరెంటు బిల్లు కట్టలేదు. చాలా రోజులయింది. ఫ్యూజులు పీకేస్తారు. ఇంటాయన అగ్గైపోతాడు—అద్దెకూడా రెండు నెలలుగా ఇవ్వలేదు.)

ఇంకా ముందుకి నడిచాడు. (ఆమె కాస్త లావెక్కింది—అప్పటికన్నా పుష్టిగా ఉంది—అదిగో, ఆ గున్నమామిడి చెట్టులా ఉంది. అన్నట్టు కట్టెల్లేవు. రేపైనా కొనాలి—బొగ్గులైనా కొనాలి. లేకపోతే కిరసనాయిలు కాల్చేస్తారు. అది భరించలేను—వెధవ పనికిమాలిన ఉద్యోగం—కట్టెలు కొనడానికీ చాలని ఉద్యోగం చేస్తున్నాను. ఈ నౌకిరీమానేసి కిరాణా కొట్టు పెట్టుకుంటే మంచి లాభం—మేడలు కట్టుకో వచ్చు.)

రాత్రి పన్నెండయింది—ఎవరో ముందుకి తోస్తున్నట్టుగా నడుస్తున్నాడు.

(ఇన్నేళ్ళ జీవితంలో నే నేం సంపాదించాను? ఏం అనుభవించాను? దేశాని కేం ఉపకారం చేశాను? నాకు నే నేం ఉపకారం చేసుకున్నాను? ఇల్లూ ఆఫీసూ—ఇంట్లో పెళ్ళాం ఆఫీసులో ఆఫీసర్లూ—పెళ్ళాం ఇది లేద ది లే దంటుంది—ఆఫీసర్లు ఇదీబాగా లే దది. బాగా లేదం టారు. ఇరువర్గాల వాళ్ళూ నన్ను కాల్చుకు తిన్నారు—పెళ్ళామూ నన్నేం సుఖపెట్టలేదు? నా శ్రమ తేరగా తించి—ఆఫీసర్లూ సుఖపెట్టలేదు. నా రక్తమూ అభిమానమూ పిల్చేశారు. నే నొక యంత్రాన్నై పోయాను. నా గురించి నే నేం జీవించలేదు. ఇతర్ల గురించి బతికేను—ఛీ ఎవడికొవాలి ఉద్యోగం? ఎందుకీ పెళ్ళాం? పిల్లలూ? అసలు పెళ్ళే చేసుకోకపోతే బాగుండేదేమో? ఎందుకీ బాదరబందీ అంతా? ఎవరి కోసం? దేని కోసం? నేను బతికితే ఎవడి క్కావాలి? బతక్కపోతే ఎవడిక్కావాలి? రేపు రిటైరవుతాను. ఎల్లుండి ఛస్తాను—అంతే—ఇంతేనా జీవితమంటే. . . దేశనాయకులౌతారు. కళాకారులౌతారు — పెద్ద సైంటిస్టు లౌతారు. నేనేమయాను? దగుల్బాజీ నయాను—దద్దమ్మనయాను. నా మీద నాకే సిగ్గేస్తూంది. అసహ్యమేస్తూంది. హినస్—హినస్—ఈ ఆఫీసు హినస్ ఈ పెళ్ళాం పిల్లలూ హనస్. ఈ బతుకే హనస్—అసలు నేనే హినస్.)

నిండుగా ఊపిరి పీల్చుకుని చుట్టూ చూశాడు. ముందుకి నడిచాడు. (గతానికి దూరంగా పోతే మరో చోట మరో దీనిలో కొత్త జీవితం ప్రారంభిస్తే, నలుగురికి సేవచేస్తే—ఒకసముద్రం ఈదితే—ఒక పర్వతం దాటితే—కలకాలం నా గురించి పది మంది చెప్పుకుంటారు. నా ఉనికి సృష్టికి పనికొస్తుంది. ఎంత పెట్టినా ఈ పెళ్ళామింతే. ఎంత చేసినా ఈ ఆ సిసంతే. ఛీ—ఆ రెండూమరిచిపోదాం. ఇల్లూ ఆఫీసూ లేవు. లేవు. వాటితో ఈ ప్రాణికి సంబంధం లేదు—లేదు. అసలు రాఘవరావనేగుమాస్తా లేనేలేడు—లేడు—హమ్మయ్య, ఇలా అనుకుంటే హాయిగా ఉంది—చాలా హాయిగా ఉంది—వెన్నెల బాగుంది. ఆకాశం బాగుంది—నక్షత్రాలు బాగున్నాయి. ప్రపంచం విశాలంగా ఉంది. జీవితం ప్రశాంతంగా ఉంది.)

రెండయింది.

రాఘవరావు నడుస్తూనే ఉన్నాడు—ఎక్కడికో—ఎక్కడికో! ముందుకి—గమ్యం లేదు. వెనక్కి తిరిగి రాడనే గ్యారంటీ లేదు.

దేశంలో రాఘవరా వింకా బతికే ఉన్నాడు. కాబట్టి ఈ కథకి పతాక సన్నివేశమూ, ముగింపూ లేవు. ★

జ్ఞాపకాలు

ఫోటో: కె. మధు (తెనాలి)

